సాక్షి
మహబూబాబాద్
శనివారం | 17 | ఆగస్టు | 2024



డైనింగ్‌హాల్ వినియోగమెప్పుడో..
కేయూలోని న్యూ పీజీ హాస్టల్ వద్ద రూ.2.40కోట్ల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాల్ నిరుపయోగంగా మారింది.
- 8లో▸



సివిల్స్‌పై అవగాహన పెంచుకోవాలి
పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సివిల్స్ పరీక్షపై అవగాహన పెంచుకోవాలని మాజీప్రధాన ఎన్నికల కమిషనర్ బీఎస్ సంపత్ అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
39.8⁰ /25.7⁰

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కనీస వేతనం చెల్లించాలి



నెహ్రూసెంటర్: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌సారథిరెడ్డి అన్నారు. తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా సమితి సమావేశం శుక్రవారం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అరకొర వేతనాలతో సతమతమవుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఆరోగ్యబీమా, జీవిత బీమా సౌకర్యం కల్పించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి ఇవ్వాలని, నూతన భవనాలను నిర్మించాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎల్లారీశ్వరి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్, చిర్ర లక్ష్మీనర్సమ్మ, కీసర సౌమ్యశ్రీ, ఎండి. మహమూద, పెరుగు వరలక్ష్మి, బాదావత్ పద్మ, ఎండి.రజియా, పెరుగు కుమార్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు బదిలీలు చేపట్టాలి



ఏటూరునాగారం: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు నిబంధనల మేరకు చేపట్టాలని ఆయా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తూ శుక్రవారం పీఓ చిత్రా మిశ్రాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ వైద్య సురేందర్, ధరావత్ రాజు, వైస్ ప్రెసిడెంట్ కొక్కెర రమేష్, కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల పరిస్థితి మారిందన్నారు. ప్రభుత్వం పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో ఐటీడీఏ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న, అన్ని విభాగాల్లో అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పదోన్నతి కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జబ్బ రవి, మహిపతి సంతోష్, బానోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి



ములుగు రూరల్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం ములుగు మండలంలోని ముద్దునూరుతండాలో నూతనంగా నిర్మించిన బంజారాల ఆరాధ్యదైవం మేరమాయాడి ఆలయాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహరాజ్ చేతుల మీదుగా ఆశీర్వచనాలు తీసుకున్నారు. బంజారా మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. బంజారాల ఆచార వ్యవహారాలు ప్రత్యేకమన్నారు. ఆలయం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి, తాగునీటి అవసరాలకు బోరు వేసుకునేందుకు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణకు హాజరైన మాజీ వీసీ

కేయూ క్యాంపస్: కేయూ మాజీ వీసీ వెంకటరత్నం శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(వరంగల్) అధికారుల వద్ద హాజరైనట్లు సమాచారం. 2013లో వెంకటరత్నం వీసీగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా వర్సిటీలో మినిమమ్ స్కేల్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారనే ఫిర్యాదు మేరకు ఈనెల 16న విచారణకు హాజరు కావాలని ఇటీవల వెంకటరత్నానికి అధికారులు నోటీస్ పంపారు. దీంతో ఆయన హనుమకొండలోని కేఎల్ఎన్ రెడ్డి కాలనీలో ఉన్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. వెంకటరత్నం స్టేట్‌మెంట్‌ను విజిలెన్స్ అధికారులు రికార్డు చేసినట్లు తెలిసింది.

మొక్కే కీలకం!



నర్సరీలో పెంచుతున్న మిర్చినారు



జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలసిన మిర్చినారు నర్సరీలు

- పలుచోట్ల నాణ్యతా ప్రమాణాలపై అనుమానం
- అధికారుల పర్యవేక్షణే నమ్మకం
- వైరస్ భయంతోనే నర్సరీలను ఆశ్రయిస్తున్న రైతులు

సాక్షి, మహబూబాబాద్: ఎన్ని కష్టాలు వచ్చినా.. ఎంత నష్టం జరిగినా.. రైతులు మిర్చి సాగును వదలడం లేదు. జిల్లాలో మూడు సంవత్సరాలుగా పేనుబంక, తామర, గండుపూత, తదితర రోగాల బారిన పడి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. అయినా ఈ ఏడాది రైతులు వెనుకాడకుండా మిర్చి సాగుకు సిద్ధమవుతున్నారు. 70వేల ఎకరాలకు పైగా మిర్చి సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేశారు. ఇందు కోసం 560కోట్ల మొక్కలు అవసరం. అయితే దీనిని దృష్టిలో పెట్టుకొని గతం కన్నా రెట్టింపు సంఖ్యలో మిర్చినారు పెంచే నర్సరీలు వెలిశాయి. కాగా నర్సరీల్లో పెంచే మొక్కల్లో నాణ్యత ఎంత.. పెంచుకున్న మొక్కలు మంచివా.. నర్సరీ మొక్కలు నాటితే లాభమా.. అనే మీమాంసలో మిర్చి రైతులు ఉన్నారు.

వైరస్ భయంతో..

రైతులు ఎక్కడి నుంచో తెచ్చిన మొక్కలు నాటడం కన్నా.. తామే పెంచుకున్న మొక్కలను నాటేందుకు ఇష్టపడుతారు. తమకు నచ్చిన విత్తనాలు తెచ్చుకొని, ఎకరానికి 10ప్యాకెట్ల చొప్పున పోసి నారు పెంచుతారు. అయితే గత ఏడాది వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు పోసిన నారుకు చాలాచోట్ల వైరస్ వచ్చింది. దీంతో అప్పటికప్పుడు నర్సరీ మొక్కలు తెచ్చి నాటాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా తీసుకొచ్చి నాటిన మొక్కల్లో కొన్ని మంచికాపు వచ్చి లాభాలు రాగా.. కొన్నిచోట్ల మాత్రం మొక్కలు రోగాల బారిన పడి చనిపోయాయని పలువురు రైతులు చెబుతున్నారు.

విచ్చలవిడిగా నర్సరీలు..

మిర్చి సాగుపై రైతుల ఆసక్తిని గమనించిన పలువురు వ్యాపారులు నర్సరీలు పెట్టేందుకు పోటీపడ్డారు. విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. కాగా జిల్లాలో అధికారుల అనుమతులు పొందినవి 100 ఉండగా.. అనుమతులు లేకుండా మరో 100 నర్సరీలు ఉన్నట్లు అంచనా. అయితే నర్సరీ ఏర్పాటుకు అనువైన భూమి, నీటి వసతి, నెట్ మొదలైనవి ఏర్పాటు చేయాలి. గుర్తింపు ఉన్న కంపెనీల విత్తనాలు కొనుగోలు చేసినట్లు ఆధారాలు చూపించాలి. రశీదులు, ప్యాకెట్ల కవర్లు భద్రపర్చాలి. వీటిని ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షణ చేసి మొక్కలు పెంచేందుకు అనుమతించాలి. కాగా జిల్లాలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో కొన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండగా.. మిగిలినవి ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఏర్పాటు చేసిన నర్సరీల్లో రైతులు ఇచ్చిన ప్యాకెట్లు పోసి పెంచితే మొక్కకు రూ.60పైసలు, అలా కాకుండా నర్సరీ యజమానులే పెంచితే మొక్కకు రూ.1 నుంచి రూ.1.50పైసల వరకు ధర పలుకుతుంది. అయితే ఇందులో కంపెనీ మొక్కలు కాకుండా.. ఊరు, పేరు లేని మొక్కలు కూడా అమ్మకాలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణలో నడపాలి



బయట పెంచిన మిర్చి నారు కంటే నర్సరీల్లో పెంచిన మొక్కలు మంచిగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఎక్కడ పడితే అక్కడ నర్సరీలు ఏర్పాటు చేశారు. వీటిని అధికారులు పరిశీలించాలి. అన్ని మంచివేనా.. అందులో నాసిరకం ఉన్నాయా అనేది అధికారులు చూడాలి. మొక్కలు నాటిన తర్వాత రైతు నష్టపోతే తిరిగి రాదు.

– బానోత్ సజీవనాయక్, గాజతండా, కురవి

నిబంధనలు పాటించాలి



మిర్చి సాగుచేసే రైతులు తమ చేనులో నారు పెంచుకోవచ్చు. నర్సరీ మొక్కలు ద్వారా కూడా మంచి దిగుబడి వస్తోంది. అయితే నర్సరీలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా.. మొక్కలు కొనగానే రశీదు ఇస్తున్నారా.. గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలు నాటారా అని పరిశీలించాలి. నిబంధనలు పాటించకుండా మొక్కలు అమ్మితే చర్యలు తీసుకుంటాం.

– మరియన్న, జిల్లా ఉద్యానశాఖ అధికారి

వైభవంగా 'వరలక్ష్మీ వ్రతం'





వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

మహబూబాబాద్ రూరల్: శ్రావణ మాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు తాటిపాముల దుర్గాప్రసాద్ అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. అర్చన అష్టోత్తర శతనామ పూజలు చేశారు. ఆలయ కల్యాణ మండపంలో బ్రహ్మోత్తములు బ్రహ్మశ్రీ తాటిపాముల నర్సింహమూర్తి మహిళలచే సామూహిక కుంకుమార్చనలు, వరలక్ష్మీ వ్రతాలను ఆచరింపజేశారు. వ్రతాల అనంతరం భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. మహిళా భక్తులతో ఆలయం కిటకిటలాడింది.

మహాగాయత్రి దేవాలయంలో..

పట్టణ శివారులోని నర్సంపేట రోడ్డులోని మహాగాయత్రి అమ్మవారి ఆలయంలో భక్తులు సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు గాయత్రిదేవి అమ్మవారికి పూజలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని ఐదు జంటల నాగేంద్రుల విగ్రహాల వద్ద భక్తులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు.

భక్త మార్కండేయ శివాలయంలో..

పట్టణంలోని భక్త మార్కండేయ శివాలయంలో భక్తులు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. మార్కండేయ శివుడికి ఆలయ ప్రధాన అర్చకులు కొత్తూరి లక్ష్మీనర్సింహమూర్తిశర్మ అభిషేకాలు, అర్చనలు చేశారు. భక్తులు సంతోషిమాత అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఫ్రైడే డ్రైడే నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

నెల్లికుదురు: గ్రామాల్లో తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించాలని డీఎల్‌పీఓ పుల్లారావు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొని సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ పద్మ, పంచాయితీ కార్యదర్శి రాజేష్, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ప్రాథమిక పోలీసింగ్‌కు ప్రాధాన్యమివ్వండి

- పోలీసుశాఖ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి
- జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం



మాట్లాడుతున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి



ఎస్పీ, పోలీసు అధికారులతో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: ప్రాథమిక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదుదారులు పోలీస్‌స్టేషన్‌కు వస్తే ప్రశాంతమైన వాతావరణం కనిపించాలని పోలీసుశాఖ మల్టీజోన్–1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు అధికారులతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐజీకి ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ స్వాగతం పలికిన అనంతరం సాయుధ బలగాల నుంచ గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసుల పనితీరు, నిషేధిత మావోయిస్టుల కదలిక, ప్రస్తుత స్థితిగతులు, జిల్లా శాంతిభద్రతల గురించి ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ.. జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. మావోల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టులు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా నిలువరించాలని అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, శిక్షల శాతాన్ని పెంచాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టాలని, జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రికార్డులు, ఫైళ్లను ఒక క్రమపద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రతీ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు నిత్యం అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ అప్రమత్తం చేయాలని తెలియజేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య, మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు, ఏఆర్ డీఎస్పీలు శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ భారం



రూ.కోటిపైనే గ్రంథాలయాల సెస్ బకాయి

- కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాఠకుల ఇబ్బందులు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- పలు గ్రంథాలయాలకు స్వీపర్లే దిక్కు



మానుకోటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం

మహబూబాబాద్: గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు చెల్లించే పన్నుతో గ్రంథాలయాల నిర్వహణ చేపడుతున్నారు. అయితే పన్ను చెల్లింపులో జాప్యం జరుగుతుండడంతో గ్రంథాలయాల నిర్వహణ భారంగా మారుతోంది. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం మినహా మిగిలిన లైబ్రరీల్లో కనీస సౌకర్యాలు లేక పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు సిబ్బంది కొరత వెంటాడుతోంది. కొన్ని గ్రంథాలయాల్లో స్వీపర్లే దిక్కుగా మారురు.

14 గ్రంథాలయాలు..

జిల్లాలో 14 గ్రంథాలయాలు ఉన్నాయి. ఇందులో ఒకటి జిల్లా గ్రంథాలయం, 11 శాఖ గ్రంథాలయాలు, 2 గ్రామ గ్రంథాలయాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో మొదట 1939లో బాపూజీ పేరున యువకులు స్వచ్ఛందంగా గ్రంథాలయం ఏర్పాటు చేయగా.. 1964లో ప్రభుత్వం దానిని శాఖ గ్రంథాలయంగా మార్చింది. మహబూబాబాద్ జిల్లా ఏర్పాటు తర్వాత జిల్లా గ్రంథాలయంగా అప్‌గ్రేడ్ చేశారు. 2017 ఏప్రిల్ 14న జిల్లా గ్రంథాలయ సంస్థ ఏర్పాటైంది. కాగా రెండు గదులతో శిథిలావస్థ భవనంలో కొనసాగిన గ్రంథాలయాన్ని ఆధునిక హంగులతో నిర్మించిన భవనంలోకి మార్చారు. దానిలో రీడింగ్ కోసం రెండు గదులు, పుస్తకాలు భద్రపర్చేందుకు గది, చైర్మన్, సెక్రటరీల కోసం రెండు చాంబర్లు, కాన్ఫరెన్స్ హాల్ కేటాయించారు. ఇంటర్‌నెట్, ప్రొజెక్టర్, పత్రికల కోసం వేర్వేరుగా గదులు కేటాయించారు. జిల్లా గ్రంథాలయంలో 27,963 పుస్తకాలు ఉండగా, 3107మంది సభ్యులు ఉన్నా రు.

వెంటాడుతున్న సిబ్బంది కొరత..

జిల్లా గ్రంథాలయంలో ఇద్దరు లైబ్రేరియన్లు, ఒక డిప్యూటీ లైబ్రేరియన్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, వాచ్‌మెన్, అటెండర్, తోటమాలి ఉండాలి. కానీ ఇద్దరు లైబ్రేరియన్లు, రికార్డు అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ సెక్రటరీ లేకపోవడంతో ఇన్‌చార్జ్ మాత్రమే పని చేస్తున్నారు. అన్ని హంగులతో లైబ్రరీ ఏర్పాటు చేసినప్పటికీ సిబ్బంది కొరతతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

స్వీపర్లే దిక్కు..

జిల్లాలోని ఇనుగుర్తి, కేసముద్రం, నెల్లికుదురు, తొర్రూరు, దంతాలపల్లి, డోర్నకల్, గార్ల, బయ్యారం, మరిపెడ, కొత్తగూడ, గూడూరు మండలాల్లో శాఖ గ్రంథాలయాలు ఉన్నాయి. ఒక గ్రంథాలయం అద్దె భవనంలో, ఆరు గ్రంథాలయాలు అద్దె లేని భవనాలు, నాలుగు గ్రంథాలయాలు సంస్థ భవనాల్లో కొనసాగుతున్నాయి. కాగా 11 మంది లైబ్రేరియన్లకు ఒకరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మిగిలిన శాఖ గ్రంథాలయాల నిర్వహణ బాధ్యత స్వీపర్లే చూసుకుంటున్నారు. అలాగే కురవి, రాజోలులో శాఖ గ్రంథాలయాలు ఉండగా.. అద్దె లేని భవనాల్లో కొనసాగుతున్నాయి. కురవి గ్రంథాలయానికి రూ.10లక్షలు మంజూరు కాగా.. స్థల సమస్యతో భవన నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఈ గ్రంథాలయాకు కూడా లైబ్రేరియన్లు లేరు.. స్వీపర్లే దిక్కుగా మారారు.

రూ.కోటిపైనే బకాయి..

గ్రంథాలయాల నిర్వహణకు ఇంటి పన్నులో 8శాతం చెల్లించాల్సి ఉంటుంది. కాగా మానుకోట మున్సిపాలిటీ నుంచి గ్రంథాలయాలకు పన్ను చెల్లిస్తున్నారు. తొర్రూరు మున్సిపాలిటీ నుంచి అంతంత మాత్రంగా చెల్లిస్తుండగా డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల నుంచి బకాయిలు ఎక్కువగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 461 గ్రామ పంచాయతీలు ఉండగా.. కొన్ని జీపీలు మాత్రమే పన్ను చెల్లిస్తున్నాయని అధికారులు తెలిపారు. కాగా జిల్లాలో రూ.కోటికిపైగా సెస్ బకాయి ఉండడంతో గ్రంథాలయాల నిర్వహణ భారంగా మారడంతో పాటు అభివృద్ధికి నోచుకోవడం లేదని సిబ్బంది, పాఠకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఇటీవల గ్రంథాలయాల పన్ను విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవడంతో కొంత పన్ను చెల్లించినట్లు సిబ్బంది తెలిపారు.

చైర్మన్ నియామకంలో జాప్యంతో..

జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్‌గా పనిచేసిన గుడిపుడి నవీన్‌రావు గత డిసెంబర్ 5వ తేదీన రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి కొత్త చైర్మన్‌ను నియమించలేదు. చైర్మన్ లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతుంది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధిపై దృష్టిసారించి సిబ్బంది భర్తీతో పాటు సెస్ బకాయి చెల్లింపులు, పక్కా భవనాల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పాఠకులు, సిబ్బంది కోరుతున్నారు.

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు



వైద్య విద్యార్థుల నిరసన

నెహ్రూసెంటర్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై లైంగిక దాడి.. హత్యను నిరసిస్తూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, వైద్య విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు, విద్యార్థులు మాట్లాడుతూ... వైద్యుల రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఘనటపై విచారణ వేగవంతం చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవీందర్, డాక్టర్ రాజమోహన్, డాక్టర్ దివ్య, అమూల్య, అనిషా, రాహుల్, తేజ, ఏహ్తేషామ్ తదతరులు పాల్గొన్నారు.

నేడు ఓపీ సేవలు బంద్

వైద్య విద్యార్థినిపై అత్యాచారం ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ న్యూఢిల్లీ పిలుపు మేరకు జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో శనివారం ఉదయం 6గంటల నుంచి ఆదివారం ఉదయం 6గంటల వరకు ఓపీ సేవలు, సాధారణ ఆపరేషన్లు నిలిపివేస్తున్నట్లు జిల్లా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు నెహ్రూనాయక్, డాక్టర్ సీపతి సురేందర్ శుక్రవారం తెలిపారు. ప్రజలు, రోగులకు కలుగుతున్న అసౌకర్యానికి చింతిస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

శ్రావణ శుక్రవారం రిజిస్ట్రేషన్ల జోరు



కాజీపేట అర్బన్ : వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా రిజిస్ట్రేషన్ల జోరు కొనసాగింది. సబ్ రిజిస్ట్రార్లు రామనర్సింహారావు, ఆనంద్ 71 దస్తావేజులకు రిజిస్ట్రేషన్లను పూర్తి చేశారు. దీంతో ఖజానాకు సుమారు రూ.60లక్షల ఆదాయం సమకూరినట్లు సమాచారం.

రేపు 4కే రన్: సీపీ

హన్మకొండ చౌరస్తా: మత్తు వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించడానికి ఈనెల 18న 4కే రన్ నిర్వహిస్తున్నట్లు వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహించే పరుగులో నగరంలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం 7గంటలకు వరంగల్ పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద 4కే రన్ ప్రారంభమవుతుందన్నారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యువతలో ఉత్సాహం నింపాలని సూచించారు. ఈరన్‌లో జాతీయ స్థాయి క్రీడాకారులతో పాటు ప్రముఖులు, కళాకారులు పాల్గొంటారని, ముగ్గురు విజేతలకు రూ.5వేలు, తర్వాతి స్థానంలో వచ్చిన వారికి రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యే మురళీనాయక్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కేసముద్రం: మహిళలను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ మాజీమంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసి, ఆస్తులను అమ్ముకుందామని చూసిందని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించి, ఆర్టీసీని అభివృద్ధిలోకి తీసుకువచ్చిందన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ మహిళలను అవమానపరిచే విధంగా మాట్లాడారని, వెంటనే మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఇనుగుర్తి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీమంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, గుజ్జునూరి బాబురావు, ఎండి.అయూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20న జాబ్ మేళా

కాశీబుగ్గ సెంటర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ వివాహిత యువతులకు ఈనెల 20న (మంగళవారం) ఉదయం 11గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం 95738 85532 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

22నుంచి సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

న్యూశాయంపేట: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు హనుమకొండలో జరగనున్నాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండ హరిత కాకతీయ హోటల్ వేదికగా ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్ నారాయణ, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, నేతలు హాజరుకానున్నట్లు వివరించారు. నాయకులు జ్యోతి, రాజారెడ్డి, భిక్షపతి, సారయ్య, రమేష్, శ్రీనివాస్, రవి, రాజు పాల్గొన్నారు.

జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా చక్రపాణి


సాంబరాజు చక్రపాణి


పల్లెపాడు దామోదర్

వరంగల్: గుజరాత్ అబాజీలో జరిగిన వినియోగదారుల జాతీయ సమావేశాల్లో కేంద్ర కమిటీకి శుక్రవారం జరిగిన ఎన్నికల్లో తెలంగాణ నుంచి సాంబరాజు చక్రపాణి రెండోసారి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు సీనియర్ సెక్రటరీగా డాక్టర్ పల్లెపాడు దామోదర్, కార్యదర్శిగా అన్నా ప్రగడ శివపార్వతి రెండేళ్ల కాలానికి ఎన్నికయ్యారు.

పరీక్ష కేంద్రంలో సదుపాయాలు కరువు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎంపీఈడీ విద్యార్థులకు ఈనెల 14నుంచి నాల్గో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. అయితే వీరికి క్యాంపస్‌లోని బీఈడీ కాలేజీ పరీక్షకేంద్రంగా కేటాయించారు. ఈనెల 14న ఆ పరీక్షకేంద్రంలో పరీక్ష రాసిన ఓ విద్యార్థి కనీస వసతులు లేవని శుక్రవారం ఒక ప్రకటనలో తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక గదిలో 8ఫ్యాన్లు ఉండగా నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. గదిలో సరిపడా విద్యార్థులు పోను మిగిలిన ముగ్గురు విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టి పరీక్ష రాయించారని పేర్కొన్నారు. ఎండ వేడిమి, ఉక్కపోతను ఇబ్బంది పడ్డామని వాపోయారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. మధ్యాహ్నం వేళ 3గంటలపాటు వరండాలో పరీక్షా రాసేందుకు ఇబ్బంది పడ్డట్లు తెలిపారు. మిగితా పేపర్ల పరీక్షలకైనా గదుల్లోనే నిర్వహించాలని కోరారు. గదుల్లో ఫ్యాన్లు కూడా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డైనింగ్ హాల్ వినియోగమెప్పుడో?

- రూ.2.40 కోట్ల వ్యయంతో కేయూ న్యూపీజీ బాయ్స్ హాస్టల్ నిర్మాణం
- లాంఛనంగా ప్రారంభించి ఐదు నెలలు..
- అందుబాటులోకి రాక విద్యార్థులకు ఇబ్బందులు


న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ వద్ద నిర్మించిన డైనింగ్‌హాల్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని న్యూ పీజీ హాస్టల్ వద్ద రూ.2.40కోట్ల వ్యయంతో నిర్మించిన డైనింగ్ హాల్ నిరుపయోగంగా మారింది. నిర్మాణం పూర్తయి 5 నెలలు గడుస్తున్నా వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ హాస్టల్ విద్యార్థులు ఒకసారి టిఫిన్, రెండుసార్లు కామన్ మెస్‌కు భోజనానికి వెళ్లి రావాల్సి ఉంటుంది. కామన్‌మెస్‌కు ఆ హాస్టల్ దూరంగా ఉంటుంది. దీంతో కొన్ని సంవత్సరాల నుంచి ఈ హాస్టల్‌కు ప్రత్యేకంగా డైనింగ్ హాల్ నిర్మించాలని డిమాండ్ ఉండేది.

కామన్‌మెస్‌లో 1,500 మందికి కార్డులు

ప్రతి విద్యాసంవత్సరం యూనివర్సిటీలోని కామన్ మెస్‌లో 1,500 మందికిపైగానే విద్యార్థులకు మెస్ సదుపాయం కల్పిస్తున్నారు. క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్లలో ఉండే విద్యార్థులందరూ ఈ మెస్‌లోనే భోజనం చేస్తారు. అయితే ఎక్కువమంది విద్యార్థులు ఉండడం వల్ల నాణ్యమైన భోజనం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై విద్యార్థులు పలుమార్లు ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. న్యూ పీజీ బాయ్స్ హాస్టల్ వద్ద డైనింగ్ హాల్ నిర్మిస్తే ప్రయోజనం కలుగుతుందని విద్యార్థులు డిమాండ్ చేస్తూవచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు న్యూ పీజీ బాయ్స్‌హాస్టల్ వద్ద డైనింగ్ హాల్ నిర్మించినా.. ఫలితం లేకుండాపోయింది.

లాంఛనంగా ప్రారంభించి ఐదు నెలలు..

క్యాంపస్‌లో న్యూపీజీ హాస్టల్ వద్ద రూ 2.40 కోట్ల వ్యయంతో యూనివర్సిటీ అధికారులు డైనింగ్ హాల్ నిర్మించారు. ఈఏడాది మార్చి 10న లాంఛనంగా వివిధ భవనాలతోపాటు డైనింగ్‌హాల్‌ను కూడా ప్రారంభించారు. అయితే ఐదు నెలలైనా ఆ డైనింగ్‌హాల్‌ను విద్యార్థుల కోసం వినియోగించడంలో జాప్యం చేస్తున్నారు.

డైనింగ్‌హాల్‌ను త్వరగా ఓపెన్ చేయాలి



న్యూపీజీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ దూరంగా ఉన్న కామన్‌మెస్‌కు రోజుకు మూడుసార్లు వెళ్లి వస్తున్నాం. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. తిన్న వెంటనే అన్నం జీర్ణమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన డైనింగ్‌హాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి. అప్పుడే న్యూపీజీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు ఉపశమనం కలగనుంది.

-మాసాని ప్రదీప్, ఎంఎస్‌డబ్ల్యూ ఫస్టియర్

కొనుగోళ్లకు ఆర్డర్ ఇచ్చారు



డైనింగ్‌హాల్‌లో కావాల్సిన టేబుల్స్, ఫర్నిచర్, స్టీల్‌కు సంబంధించి సంబంధిత అధికారులు ఇటీవల ఆర్డర్ ఇచ్చారు. అలాగే మోడర్న్ కిచెన్ ఉంది. అందులోకి అవసరమైన వంట సామగ్రి కూడా కొనుగోలు చేయాల్సింటుంది. హెడ్‌కుక్, అసిస్టెంట్‌కుక్‌తోపాటు వర్కర్స్ రెండు షిఫ్ట్‌లో పనిచేసేందుకు నియమించుకోవాల్సిన అవసరం ఉంటుంది. మోడర్న్ కిచెన్ వినియోగించుకోవాలంటే అందుకు శిక్షణ పొందిన వంటచేసేవాళ్లు ఉండాల్సింటుంది. కొత్తగా ఈవిద్యాసంవత్సరం(2024-2025) మొదటి సంవత్సరం విద్యార్థులు వచ్చేలోపు ఈ డైనింగ్ హాల్‌ను వినియోగంలోకి తీసుకొస్తాం

-డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ , కేయూ హాస్టళ్ల డైరెక్టర్

సివిల్స్‌పై అవగాహన పెంచుకోవాలి

- మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ వీ.ఎస్.సంపత్


సివిల్స్ ర్యాంకర్‌ను సన్మానిస్తున్న దేవేందర్‌రెడ్డి, అతిథులు

హన్మకొండ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు సివిల్స్ పరీక్షపై అవగాహన పెంచుకోవాలని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ వీ.ఎస్.సంపత్ అన్నారు. శుక్రవారం హనుమకొండ కిషన్‌పురలోని వాగ్దేవి కళాశాలలో దీక్ష ఐఏఎస్ అకాడమీ, వాగ్దేవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో చూస్ సివిల్ సర్వీసెస్ ఆజ్ కెరీర్ అనే అంశంపై 8, 9, 10వ తరగతి, గ్రాడ్యుయేట్ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు వీ.ఎస్.సంపత్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమైతే సులువుగా ర్యాంకులు సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈ దిశగా అవగాహన ఏర్పరచుకుని విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. సంకల్ప్ వ్యవస్థాపకుడు సంతోష్ కుమార్ తనేజ, రిటైర్డ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.ఉమామహేశ్వర్ రావు మాట్లాడుతూ సివిల్స్ సాధించాలనే ఔత్సాహికులకు సంపూర్ణ అవగాహన పెపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారు సివిల్ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి... ఏఏ అంశాలపై పట్టు సాధించాలి వంటి అంశాలపై కూలంకశంగా వివరించారు. అదే విధంగా 2023 సివిల్స్ ర్యాంకర్స్ అనూష, భార్గవ్ కుమార్, కిరణ్‌సాయి ఇంపు, లవన్ కుమార్ పోరిక వారు సాధించిన విజయం, వారు సన్నద్ధమైన తీరు, ఎవరెవరి సలహాలు తీసుకున్నారో వివరించారు. ఈ సందర్భంగా 2023 ర్యాంకర్స్‌ను వాగ్దేవి విద్యాసంస్థల సెక్రటరీ సీ.హెచ్.దేవేందర్‌రెడ్డి, అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ హరీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శేషాచలం పాల్గొన్నారు.

ఏఈ, సబ్ ఇంజనీర్ సస్పెన్షన్

కాశిబుగ్గ: వరంగల్ సర్కిల్ పరిధిలోని ఏజే మిల్స్ ఏఈగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.జ్యోతిర్మయి నాథ్‌ను ఎన్పీడీసీఎల్ సీజీఎం(హెచ్‌ఆర్‌డీ) టి.మధుసూదన్, గొర్రెకుంట సబ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.నరేష్‌ను వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం విద్యుత్ శాఖలో పనిచేస్తున్న క్యాజువల్ లేబర్ కరుణాకర్‌రెడ్డి కాశిబుగ్గలో కరెంట్ పోయింది.. ఎప్పుడొస్తుంది సార్.. అని ఫోన్‌లో అడగగా దానికి ఏఈ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయం ఏఈ, గొర్రెకుంట సబ్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లడంతో మరలా ఏఈ, సబ్ ఇంజనీర్లు ఫోన్‌లో బూతులు తిట్టారు. ఈవిషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో శుక్రవారం దినపత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాల ఆధారంగా ఏఈ, సబ్ ఇంజనీర్లపై సస్పెన్షన్ వేటు వేసినట్లు కార్యాలయ వర్గాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

స్టేషన్‌ఘన్‌పూర్: భూమి కొనుగోలు విషయంలో ఒప్పందం ప్రకారం డబ్బు ముట్టినా రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేస్తుందని కోరం పూలమ్మ చేసిన ఫిర్యాదు మేరకు సత్తు లక్ష్మిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వేణు శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఛాగల్లు గ్రామానికి చెందిన కోరం పూలమ్మ అదే గ్రామానికి చెందిన సత్తు లక్ష్మికి చెందిన గ్రామశివారులోని ముప్పైమూడున్నర గుంటల భూమిని గుంటకు రూ.70వేలు చొప్పున కొనుగోలు చేసేందుకు జనవరి 23, 2023న ఒప్పందం చేసుకుంది. 27మార్చి 2024 వరకు సాక్షుల సమక్షంలో మొత్తం డబ్బులు లక్ష్మికి అందించింది. అయితే డబ్బులు ముట్టినా సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేయించకుండా కాలయాపన చేస్తున్నారని, స్థలంపై కబ్జాకు పోనివ్వకుండా బెదిరిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు లక్ష్మిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

డీపీఆర్ఓ, కలెక్టరేట్ ఏఓకు మెమోలు?

కాశీబుగ్గ సెంటర్: స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి ప్రసంగానికి సంబంధించిన రెండు బుక్స్ ప్రింటింగ్, ఉత్తమ ఉద్యోగుల జాబితా తయారీపై వరంగల్ ఇన్‌చార్జ్ డీపీఆర్ఓ, కలెక్టరేట్ ఏఓకు జిల్లా కలెక్టర్ సత్య శారద మెమోలు జారీ చేసినట్లు తెలిసింది. ఖిలావరంగల్‌లోని ఖుష్‌మహల్ మైదానంలో గురువారం స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరుకాగా, మంత్రి ప్రసంగానికి డీపీఆర్ఓ రెండు బుక్స్ ప్రింట్ చేయించారు. వీటిలో ఏ బుక్ ఇవ్వాలో ఏపీఆర్ఓ, సిబ్బందికి డీపీఆర్ఓ అయుబ్ అలీ చెప్పలేదు. మీడియా ప్రతినిధులకు అందించడంలోనూ ఆలస్యం చేశారు. అప్పటివరకు సమావేశానికి డీపీఆర్ఓ హాజరుకాకపోవడంతో బుక్ విషయమై ఉద్యోగులు మదనపడ్డారు. మీడియా ప్రతినిధులు అడగగానే అసహనానికి లోనైన డీపీఆర్ఓ.. మహిళా ఉద్యోగులను అసభ్య పదజాలంతో దూషించారు. అదే విధంగా 129 మందితో ఉత్తమ ఉద్యోగుల జాబితాను రూపొందించి మీడియాకు విడుదల చేశారు. 129 మందికి కాకుండా ఏఓ మరికొంత మందిని పిలిచి ప్రశంసపత్రాలు అందించారని ఆరోపణలు వచ్చాయి. ఈ రెండు సంఘటనలపై వివిధ ప్రత్రికల్లో కథనాలు ప్రచురించారు. 24 గంటల్లో వివరణ ఇవ్వాలని డీపీఆర్ఓ, కలెక్టరేట్ ఏఓకు కలెక్టర్ మెమోలు జారీచేసినట్లు సమాచారం.

వేర్వేరు కారణాలతో పలువురి మృతి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు కారణాలతో పలువురు మృతి చెందారు. రైలులో ప్రయాణిస్తూ వెస్ట్ బెంగాల్‌కు చెందిన వ్యక్తి మృతిచెందగా.. బైక్ పల్టీకొట్టి యువకుడు, ఆటోలోంచి జారిపడి వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు.


రాజేశ్ మృతదేహం

కాశిబుగ్గ: షాలిమార్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఈస్టుకోస్టు ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న వెస్ట్ బెంగాల్ హౌరా బిర్బూర్‌కు చెందిన ప్రయాణికుడు రాజేశ్ విశ్వకర్మ(38) మృతి చెందినట్లు జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపారు. రైలులో ప్రయాణిస్తున్న విశ్వకర్మ వరంగల్ రైల్వేస్టేషన్‌కు రాగానే తీవ్ర అస్వస్థతకు గురికావడంతో వరంగల్ స్టేషన్ మాస్టర్ 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. ప్లాట్‌ఫాం నంబర్-2 పైకి రైలు చేరుకోగానే పరీక్షించిన వైద్య సిబ్బంది రాజేశ్ అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారని సీఐ వెల్లడించారు. మృతుని వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించి శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు.

బైక్ పల్టీ కొట్టి యువకుడు..


శ్రీకాంత్(ఫైల్)

నర్సింహులపేట: మండలంలోని వంతడపల స్టేజీ సమీపం ఎస్సారెస్పీ కాల్వ కల్వర్టుకు దగ్గరలో వరంగల్- ఖమ్మం హైవేపై శుక్రవారం బైక్ పల్టీకొట్టిన ప్రమాదంలో కుర్ర శ్రీకాంత్(33) మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తొర్రూర్‌కు చెందిన కుర్ర శ్రీకాంత్, రాజశేఖర్, పద్మ ముగ్గురు కురవి మండలంలోని సూదనపల్లిలో శుక్రవారం ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి బైక్‌పై తొర్రూర్ వెళ్తున్నారు. ఈక్రమంలో వంతడపల స్టేజీ సమీపంలో హైవేపై బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. దీంతో శ్రీకాంత్, శేఖర్, పద్మలకు తీవ్ర గాయాలయ్యాయి. 108లో చికిత్స నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. ఆస్పత్రికి చేరుకోగానే శ్రీకాంత్ మృతి చెందగా.. మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వారిని మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తి..

చెన్నారావుపేట: వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన మంద మల్లయ్య (55) వ్యక్తిగత పని మీద నెక్కొండకు లింగగిరి ఎక్స్ రోడ్ నుంచి ఆటోలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో తోపనగడ్డ తండా సమీపంలో ఆటోలో నుంచి జారి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. భార్య పుల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.

సారా మత్తులో గడ్డిమందు తాగిన వ్యక్తి..


నారాయణ మృతదేహం

మహాముత్తారం: సారాతాగిన మత్తులో గడ్డిమందు తాగిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన బొబ్బిలి నారాయణ(55) కూలీపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొద్దిరోజులుగా నాటు సారాకు బానిసయ్యాడు. శుక్రవారం కూడా నాటుసారా మత్తులో ఉన్న నారాయణ ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు 108వాహనంలో జిల్లా కేంద్రంలోని వందపడకల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సాయంత్రం మృతిచెందాడు. నారాయణకు భార్య, కుమారుడు ఉన్నాడు.

తల్లి మందలించడంతో యువకుడి ఆత్మహత్య

చెన్నారావుపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో తల్లి మందలించడంతో ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన కుందేలు సుభద్ర కుమారుడు రాజేశ్ గురువారం తల్లితో గొడవపడి పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తల్లి సుభద్ర ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.

డైట్‌లో గెస్ట్‌లెక్చరర్లతో విద్యాబోధన

- ఇటీవల విధుల్లోకి 12మంది..
- మరో నాలుగు సబ్జెక్టుల బోధనకు దరఖాస్తులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ఎట్టకేలకు గెస్ట్ లెక్చరర్లతో విద్యాబోధనను ఇటీవల తిరిగి ప్రారంభించారు. ఈఏడాది జూన్ నుంచి గెస్ట్ లెక్చరర్లకు రెన్యూవల్ చేయకపోవటంతో వారు విధులకు రాలేదు. ఒక్క రెగ్యులర్ అధ్యాపకులు కూడా లేకపోవడం.. ఇటు గెస్ట్‌లెక్చరర్లను రెన్యూవల్ చేయకపోవడంతో విద్యార్థులకు పాఠాలు బోధించేవారే లేకుండాపోయారు. దీంతో విద్యార్థుల ఇబ్బందులు పడుతున్న పరిస్థితిపై సాక్షిలో 'ఎవరికీ పట్టని డైట్' శీర్షికన కథనం ప్రచురితమైంది. అనంతరం తమకు పాఠాలు చేప్పేందుకు అధ్యాపకులు లేరని ఆందోళన చెందుతూ.. ర్యాలీ నిర్వహించి వరంగల్ డీఈఓ, డైట్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వాసంతికి వినతపత్రం అందించారు. స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వద్దకు వెళ్లి తమ సమస్యను వివరించారు. దీంతో శ్రీహరి.. ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంతో ఫోన్‌లో మాట్లాడి.. డైట్‌లో విద్యాబోధనకు గెస్ట్‌లెక్చరర్లనైనా నియమించాలని సూచించారు. దీతో ఎట్టకేలకు ఇటీవల సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు హనుమకొండ డైట్‌లో గత ఏడాదిలో విధులు నిర్వర్తించిన 12మంది గెస్ట్‌లెక్చరర్లు ఈనెల 9న విధుల్లో చేరారు. అయినా ఇంకా పలు సబ్జెక్టుల విద్యాబోధనకు అధ్యాపకులు అవసరం ఏర్పడింది. అయితే గెస్ట్ ఫ్యాకల్టీని నియమించుకునేందుకు సంబంధిత అధికారుల నుంచి ప్రొసిడింగ్ వచ్చినట్లు సమాచారం. దీంతో హనుమకొండలోని ప్రభుత్వ డైట్‌లో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టులు బోధించేందుకు గెస్ట్ అధ్యాపకులుగా ఆసక్తి, అర్హతగలవారు దరఖాస్తులు చేసుకోవాలని డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, వరంగల్ డీఈఓ వాసంతి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఫిలాసఫీ /సోషియాలజీ ఉర్దూ /సైకాలజీ ఉర్దూ మీడియం 1, ఉర్దూ లాంగ్వేజ్ ఉర్దూ మీడియం 1, సైన్స్ పెడగాజీ ఉర్దూ మీడియం 1, సైన్స్ పెడగాజి తెలుగు, ఇంగ్లిష్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, ఎంఈడీ విద్యార్హతలు కలిగినవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ పూర్తిబయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలతో ఈనెల 21 వరకు డైట్ కళాశాలలో సమర్పించాలని తెలిపారు.

కేయూ సైన్స్ డీన్‌గా ప్రొఫెసర్ హనుమంతు


హనుమంతును సన్మానిస్తున్న ఆచార్య సురేశ్‌లాల్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల డీన్‌గా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ హనుమంతు నియమితులయ్యారు. ఈమేరకు కేయూ వీసీ వాకాటి కరుణ అప్రూవల్ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. శుక్రవారం హనుమంతు బాధ్యతలను స్వీకరించారు. ఆచార్య హనుమంతు 22సంవత్సరాలుగా బోధనతోపాటుగా గత పదేళ్లుగా పరిశోధనానుభవం కలిగి ఉన్నారు. కెమిస్ట్రీ విభాగం అధిపతిగా, బీఓఎస్‌గా, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. ప్రస్తుతం అకాడమిక్ డీన్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సైన్స్ డీన్‌గా ఉన్న ప్రొఫెసర్ మల్లారెడ్డి నుంచి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇదిలా ఉండగా.. సైన్స్ డీన్‌గా బాధ్యతలను స్వీకరించిన హనుమంతును కేయూ పాలకమండలి సభ్యుడు, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య సురేశ్‌లాల్, కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేశ్ సన్మానించారు. డాక్టర్ సూర్యనారాయణ, వివిధసంఘాల బాధ్యులు గుగులోతు రాజునాయక్, గుగులోతు రమేశ్‌బాబు, మాలోతు వెంకట్, భూక్య రమేశ్, డాక్టర్ రాజేందర్, సూర్య, సతీశ్, దేవేందర్, వంశీ పాల్గొన్నారు.

గ్రంథాలయ శాశ్వత భవనానికి కృషి

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్


సాక్షి దినపత్రిక చదువుతున్న రియాజ్

శాయంపేట : మండల కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రాఘవేంద్ర స్వచ్ఛంద సంస్థ నుంచి రూ. 50 లక్షల నిధులతో శాశ్వత గ్రంథాలయ భవనాన్ని నిర్మాణానికి కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ అన్నారు. శాయంపేటలోని గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. యువకులకు సివిల్స్, పోలీస్, బ్యాంకింగ్ ఉద్యోగ అవకాశాల కోసం స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయా.. అని అటెండర్ రాజును అడిగి తెలుసుకున్నారు. స్టడీ మెటీరియల్ బుక్స్ రావడం లేదని తెలపడంతో జిల్లా అధికారులతో మాట్లాడి బుక్స్ పంపిస్తానని చెప్పారు. గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతోపాటు వసతులు సరిగాలేవని శాశ్వత భవనం నిర్మించాలని మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన చైర్మన్.. రాఘవేంద్ర స్వచ్ఛంద సంస్థతో మాట్లాడి ఎమ్మెల్యేతో కలిసి శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని, గ్రామ పంచాయతీ నుంచి భవనానికి ఎస్టిమేషన్ చేయించాలని సూచించారు. గ్రంథాలయాభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందగట్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ పేరుతో వసూళ్ల దందా..!

- పోలీసుల అదుపులో ఇద్దరు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్నట్లు ఇటీవల జాతీయ వైద్య మండలి అధికారికంగా ప్రకటించింది. అయితే ఈ కళాశాలకు, జిల్లా ఆస్పత్రికి అవసరమైన సిబ్బందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించేందుకు ప్రభుత్వం నవోదయ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించింది. నవోదయ ఏజెన్సీ ఇటీవల 180పోస్టులకు దరఖాస్తులను ఈనెల 01 నుండి 04వ తేదీ వరకు ఆహ్వానించింది. ఇదే అదనుగా భావించి ఏజెన్సీ పేరు చెప్పుకొని ఓ ముఠా సభ్యులు.. సుమారు పదిమంది వద్ద రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు వసూళ్లు చేసినట్లు సమాచారం. దీంతో ఎలాగైనా మెడికల్ కళాశాలలో జాబ్‌ను సంపాదించాలనే ఉద్దేశంతో ఏకంగా లక్షలు తీసుకొచ్చి ఆ ముఠా చేతికిచ్చారు. ఇదిలా ఉండగా.. పలు అవకతవకలు జరిగాయని ఇటీవల కలెక్టర్ సత్య శారద ఆ ఏజెన్సీ రద్దు చేసి మరో ఏజెన్సీకి నియామక బాధ్యతలు అప్పగిస్తామని తెల్చి చెప్పారు. అయితే అప్పటికే లక్షల్లో ఆ ముఠాకు అప్పటించిన బాధితులు ముఠా బాధ్యుల వద్దకు ప్రదక్షిణ చేసినా.. సరైన సమాధానం ఇవ్వడంలేదు. దీంతో ఏం చేయాలో అర్థంకాక నేరుగా నవోదయ ఏజెన్సీ వద్దకు వచ్చి దళారీలకు ఇచ్చిన నగదు తదితర విషయాలుపై వెల్లడించారు. దీంతో ఆ ముఠాకు చెందిన ఓ వ్యక్తికి ఫోన్ చేసి నగదు ఇస్తాం.. జాబ్ కావాలని చెప్పడంతో నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి వెనకాలకు ముగ్గురు వ్యక్తులు వచ్చారు. దీంతో ఏజెన్సీ సిబ్బంది, బాధితులు ఇద్దరిని పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పటించి, ఫిర్యాదు ఇచ్చారు. దీనిపై సీఐ రమణమూర్తిని వివరణ కోరగా ఇటీవల ఆస్పత్రికి సంబంధించిన జాబ్‌లు ఇప్పిస్తామని ఓ ముఠా డబ్బులు వసూలు చేస్తుందని బాధితులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారని, అదుపులో ఉన్న ఇద్దరిని విచారిస్తున్నామని, మిగతావారిని పట్టుకుంటామని వెల్లడించారు.

మూడురోజులు రిక్కీ నిర్వహించాం

మెడికల్‌కళాశాలలో ఇటీవల 180 ఉద్యోగాలకు దరఖాస్తులను స్వీకరించాం. అయితే నవోదయ ఏజెన్సీకి సంబంధం లేని వ్యక్తులు ముఠాగా ఏర్పడి డబ్బులు దండుకోవడం జరుగుతోందని తెలిసి మూడురోజులు రిక్కీ నిర్వహించాం, బాధితుల సమక్షంలోనే ఆ ముఠాకు చెందిన వారిని రప్పించి, ఇద్దరిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాం.

- కుమార్, నవోదయ ఏజెన్సీ నిర్వాహకుడు

బైకు దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీశ్, పక్కన ఎస్సై

హన్మకొండ చౌరస్తా: బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు. హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రవణ్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం, మల్లక్కపెల్లి గ్రామానికి చెందిన రంగు గంగాధర్ గత కొంత కాలంగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకాజీకాలనీలో వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు నెలల క్రితం బస్టాండ్ సమీపంలో దొంగిలించిన హోండా షైన్ వాహనంతో నేరస్తుడు దొరికాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. ఇదే కాకుండా గత కొంత కాలంగా హైదరాబాద్, యాదగిరిగుట్ట ప్రాంతాలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్, చేర్యాల పరిధిలో మొత్తం 5బైకులను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి నుంచి హోండా షైన్ బైక్‌ను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ సతీశ్ తెలిపారు.

అత్యాచారయత్నం.. కేసు నమోదు

ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామంలో మూగ మహిళపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. మూగ మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారానికి ప్రయత్నించాడు. మహిళ నిరాకరించి అల్లరి చేయడంతో పారిపోయాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు ఐనవోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిపై మహిళ కుమారులు గురువారం రాత్రి దాడి చేశారు. ఈ ఘటనపై కూడా కేసు నమోదు చేసుకుని అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తిని విచారిస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.